
ప్రజాశక్తి
శుక్రవారం 18 ఏప్రిల్ 2025
5
విజయనగరం




నెల్లిమర్ల కమిషనర్‌గా తారకనాథ్

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్‌గా తారకనాథ్ నియమితులయ్యారు. అమలాపురం మున్సిపాలిటీలో రెవెన్యూ అధికారిగా పనిచేస్తూ, బదిలీపై నెల్లిమర్ల నగర పంచాయతీ కమిషనర్‌గా ఆయన వచ్చారు. గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో ఎ.తారకనాథ్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనను గత కమిషనర్ అప్పలరాజు, సిబ్బంది ఆహ్వానించి శుభాకాంక్షలు తెలియజేశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్



పదో తరగతి పరీక్షలు పూర్తి కావడంతో కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థలు విద్యార్థులకు వల వేస్తున్నాయి. కళాశాలల యాజమాన్యాలు ఏకంగా గ్రామాల్లో సైతం మధ్యవర్తులను పెట్టుకుని, విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి కాలేజీల ప్రత్యేకతలను వివరిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లు సేకరించి వారికి ఎస్‌ఎంఎస్‌లు పంపుతూ, ఫోన్లు చేస్తూ ఊదరగొడుతున్నాయి. ఎలాగోలా విద్యార్థులను చేర్చుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నాయి.

- ప్రారంభమైన అడ్మిషన్ల వేట
- తల్లిదండ్రులకు ఫోన్లు, ఎస్ఎంఎస్‌ల జోరు
- ఇంటింటికీ ఉపాధ్యాయులతో ప్రచారం

కార్పొరేట్ వల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరీక్షలు పూర్తి అయిన తరువాతనే అడ్మిషన్లు నిర్వహిస్తారు. ప్రస్తుతం భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ముందుగా సీటును రిజర్వ్ చేసుకుంటే రాయితీలు కల్పిస్తామంటూ లేనిపోని ప్రకటనలతో కార్పొరేట్, ప్రయివేటు కళాశాలలు మభ్య పెడుతున్నాయి. వివిధ కోర్సులను ప్యాకేజీగా రూపొందించి 20 నుంచి 40 శాతం వరకూ ఆఫర్ చేస్తున్నాయి. విద్యార్థుల స్థాయిని బట్టి అడ్మిషన్లు సేకరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రుల్లో తమ పిల్లలను ఏ కాలేజీలో చేర్చాలోనన్న ఆలోచనలు ప్రారంభమయ్యాయి. ఆర్థిక పరిపుష్టి లేకపోయినా పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసైనా మంచి కాలేజీలో చేర్పించాలని యోచిస్తున్నారు. ఇదే అవకాశంగా సొమ్ము చేసుకునేందుకు కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల నిర్వాహకులు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. మరో వైపు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల ద్వారా గాలం వేస్తున్నారు.

ఎవరి డప్పు వారిది

కార్పొరేట్ విద్యా సంస్థలు మధ్యవర్తులను నియమించుకుని, వారి ద్వారా ప్రచారం చేస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా తమ సంస్థలు ఉన్నాయని, జిల్లాలోనే కళాశాల శాఖ ఉందని, చేరాలని ఒత్తిడి చేస్తున్నాయి. కార్పొరేట్ సంస్థలకు తామేమీ తక్కువ కాదని జిల్లాలోని పలు ప్రయివేటు కళాశాలలు కూడా విద్యార్థులకు వల వేస్తున్నాయి. ఈ ప్రచారంలో తమ కళాశాలలో ప్రత్యేకంగా ఎంసెట్, జెఇఇ మెయిన్స్, అడ్వాన్సు శిక్షణ ఉంటుందని, పిలల్లకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆశ చూపుతున్నాయి. కళాశాలలో ఎసి, నాన్ ఎసి, డేస్కాలర్, హాస్టల్, మెస్ తదితర ప్రత్యేకతలు ఉన్నాయంటూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. వెంటనే డబ్బు చెల్లించి, సీటు ఖరారు చేసుకోవాలని ఒత్తిళ్లు తెస్తున్నాయి. మెరుగైన మార్కులు సాధించిన వారికి ప్రత్యేక రాయితీలు అంటూ నమ్మించే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ ప్రచారంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఎటూతేల్చు కోలేకపోతున్నారు. ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలల మాయమాటలు నమ్మి, కొందరు పిల్లలను చేర్పించేస్తున్నారు. మరికొందరు కళాశాల చూసిన తరువాత చెబుతామని బదులిస్తున్నారు. ముందుగా చేరితే ఫీజులో రాయితీ ఇస్తామని సంస్థలు చెబుతున్నాయి. మరోవైపు గత ఏడాది కంటే ఈ ఏడాది ప్రతి కళాశాల పదిశాతం ఫీజులు పెంచేశాయి. హాస్టల్‌లో ఉండి చదువుకుంటూ రూ.1.80 లక్షలు నుంచి రూ.3.50 లక్షలు వరకూ వసూలు చేస్తున్నాయి. డే స్కాలర్‌కు రూ.50వేలు నుంచి రూ.1.50 లక్షలు వరకు వసూలు చేస్తున్నాయి.

ఎసిబి వలలో విఆర్‌ఒ

రూ.13 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని బొడ్డవలస గ్రామానికి చెందిన విఆర్‌ఒ ఒక రైతు నుంచి లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు గురువారం దాడి చేసి పట్టుకున్నారు. ఎసిబి డిఎస్‌పి బివిఎస్ఎస్ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. ఆకులుపేట గ్రామానికి చెందిన పతివాడ త్రినాథరావు తన తండ్రి పైడయ్య మరణించడంతో బొడ్డవలస రెవెన్యూ పరిధిలో ఆయన పేరు మీద ఉన్న 28 సెంట్ల భూమిని తన తల్లి పేరు మీద మ్యుటేషన్ చేయమని విఆర్‌ఒ బేరి శ్రీనివాసరావుకు దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో విఆర్‌ఒ రూ.15వేలు లంచం ఇస్తే గాని పనిచేయనని తెగేసి చెప్పాడు. దీంతో రైతు త్రినాథరావు ఎసిబి అధికారులను సంప్రదించి రూ.13 వేలు విఆర్‌ఒకు ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. వెంటనే విఆర్‌ఒతో రైతు మాట్లాడి తను డబ్బులు ఇస్తానని చెప్పి విజయనగరం నుంచి డెంకాడ తహశీల్దార్ కార్యాలయానికి వస్తున్న విఆర్‌ఒను దాసన్నపేట సమీపంలో నీలాడ చెరువు వద్ద రైతు త్రినాథరావు కలిశాడు. విఆర్‌ఒ వెంటనే రైతు వద్ద నుంచి 13 వేల రూపాయలు తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అక్కడ నుంచి విఆర్‌ఒ శ్రీనివాసరావును డెంకాడ తహశీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చి అతని వద్ద నుంచి రైతు వద్ద నుంచి స్టేట్మెంట్ తీసుకున్నారు. ఆయనపై కేసు నమోదు చేసి ఎసిబి కోర్టులో ప్రవేశపెడతామని డిఎస్‌పి తెలిపారు. ఈ దాడిలో సిఐ మహేష్‌రావు, ఎస్ఐ వాసునారాయణ పాల్గొన్నారు.



లంచం తీసుకుంటూ పట్టుబడిన విఆర్‌ఒ శ్రీనివాసరావు

నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఇ పార్కులు

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఇ పార్కులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. విజయవాడలోని ఎపి సచివాలయంలోని సిఎస్ సమావేశ మందిరం నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఉచిత ఇసుక సరఫరా, సోలార్ ప్రాజెక్టులకు భూసేకరణ, సమ్మర్ స్టోరేజి ట్యాంకుల ఫిల్లింగ్ యాక్షన్ ప్లాన్, తాగునీటి సరఫరా, సానుకూల ప్రజా అవగాహన, ఎంఎస్‌ఎంఇ సర్వే, నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఇ పార్కుల ఏర్పాటు, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర తదితర అంశాలపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విజయనగరం నియోజకవర్గంలో కొండకరకాంలో 12 ఎకరాల్లో, నెల్లిమర్ల నియోజకవర్గం డెంకాడ మండలం మోదవలసలో 19.8 ఎకరాల్లో, గజపతినగరం నియోజకవర్గం బొండపల్లి మండలం కొండకిండాంలో 57 ఎకరాల్లో, రాజాం నియోజకవర్గం రేగిడి ఆమదాలవలస మండలం సంకిలిలో 20 ఎకరాల్లో, బొబ్బిలి నియోజకవర్గం రామభద్రాపురం మండలం కొట్టక్కిలోని 100 ఎకరాల్లో, చీపురుపల్లి నియోజకవర్గం గరివిడి మండలం కుమరాంలోని 10 ఎకరాల్లో, శృంగవరపుకోట నియోజకవర్గం కొత్తవలస మండలం బలిఘట్టంలోని 57 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఇ పార్కులను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి ఎస్.సేతు మాధవన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఓటర్లు..

15,68,048 మంది

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో సవరణ అనంతరం జనవరి 6న ప్రచురించిన ఓటర్ల జాబితా ప్రకారం 15,68,048 మంది ఓటర్లు ఉన్నారని డిఆర్‌ఒ ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాను వివరించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిఆర్‌ఒ తమ ఛాంబర్‌లో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ నెలలో వచ్చిన క్లెయిములు, వాటి స్థితిగతులను వివరించారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, తొలగింపు, సవరణ, ఇతర క్లెయిములకు సంబంధించిన అంశాలపై చేసిన దరఖాస్తుల స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకొనే అవకాశాన్ని భారత ఎన్నికల కమిషన్ కల్పించిందని తెలిపారు. సిఇఒఆంధ్రా.ఎన్ఐసి.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు ఉంటాయని చెప్పారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, ఓటర్ల రేషనలైజేషన్ ప్రక్రియలో రాజకీయ పార్టీలు భాగస్వాములు కావాలని కోరారు. దీనికోసం ముందుగానే ఆయా పార్టీలు తమ ఏజెంట్ల ద్వారా క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి, వివరాలను సేకరించి సన్నద్ధంగా ఉంటే ప్రక్రియను సులువుగా పూర్తి చేయవచ్చునని సూచించారు.

ఈ సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కరరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు టిడిపి నుంచి కుటుంబరావు, వైసిపి నుంచి శ్రీనివాసరెడ్డి, బిజెపి నుంచి అప్పారావు, బిఎస్‌పి నుంచి సోములు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే అదితి

పవర్ లిఫ్టింగ్‌లో పతకాలు

అభినందించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కోడి రామ్మూర్తి వ్యాయామ సంఘం క్రీడాకారులు పవర్ లిఫ్టింగ్‌లో పలు పతకాలు సాధించారు. ఇటీవల గుడివాడలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ స్టేట్ ఛాంపియన్ షిప్‌లో పెద్ది లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో స్ట్రాంగ్ ఒమెన్‌గా జారా గోల్డ్ మెడల్ సాధించారు. ఉదయ్, మరో క్రీడాకారుడు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించారు. రామకృష్ణ జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని గురువారం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అభినందించారు.

3 నెలలకోసారి విఎంసి సమావేశం

కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం

ఎస్‌సి, ఎస్‌టి దాడులపై నిర్వహించే విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ప్రతి రెవెన్యూ డివిజన్‌లో మూడు నెలలకు ఒక సారి తప్పనిసరిగా నిర్వహించాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. అనంతరం సమావేశపు మినిట్స్‌ను జిల్లా కలెక్టర్‌కు పంపాలన్నారు. అక్కడి సమావేశంలోని అంశాలపై జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నెల 30న అన్ని మండలాల్లో ఎస్‌హెచ్‌ఒ, తహశీల్దార్ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినం నిర్వహించి, ఆ మీటింగ్ మినిట్స్‌ను పంపాలని సూచించారు. డివిఎంసి సభ్యులు బసవ సూర్యనారాయణ మాట్లాడుతూ ఎస్‌సి కాలనీల్లో కొన్ని చోట్ల శ్మశానాలు లేవని, మరి కొన్ని చోట్ల ఆక్రమించబడ్డాయని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ స్పందిస్తూ అన్ని ఎస్‌సి కాలనీల్లో తనిఖీ చేసి శ్మశానాలు ఎక్కడెక్కడ లేవో, ఎక్కడ ఆక్రమించబడ్డాయో పరిశీలించి నివేదిక పంపాలని ముగ్గురు ఆర్‌డిఒలకు సూచించారు. ఉపాధి హామీ నిధులతో శ్మశానాలు, వాటికి రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు చొప్పున మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మరో సభ్యులు చిట్టిబాబు మాట్లాడుతూ బాధితులకు పరిహారం చెల్లింపు ఆలస్యం అవుతోందని తెలపగా, నిధుల కోసం డిఒ లేఖ రాశారని, రాగానే చెల్లిస్తామని కలెక్టర్ తెలిపారు. కొన్నిచోట్ల రెండు గ్లాసుల విధానం ఇంకా అమలవుతోందని తెలపగా చట్టంపై, చట్టంలో ఉన్న శిక్షలపై సభ్యులు, పోలీస్ శాఖ వారు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సభ్యులు మజ్జి గణపతి, ఎం.రాము ఎస్‌సి కాలనీల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, , చట్టంపై అవగాహన కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలన్నిటికీ వచ్చే సమావేశం నాటికి పరిష్కారం లభించాలని కలెక్టర్ చెప్పారు. తీసుకున్న చర్యలపై సభ్యులంతా సంతృప్తి చెందేలా చూడాలని సంబంధిత అధికారులు దృష్టిపెట్టాలని ఆదేశించారు. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో ఎస్‌సి, ఎస్‌టి దాడులపై 23 కేసులు నమోదయ్యాయని, అందులో 21 కేసులు విచారణలో ఉన్నాయని తెలిపారు. 60 రోజుల్లోపు 17 కేసుల విచారణ పూర్తయిందన్నారు. ట్రయల్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలని పిపికి తెలిపారు. పరిహారం చెల్లింపులో 28 కేసుల్లో 35 మందికి గానూ రూ.31.75 లక్షలు చెల్లించామన్నారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిల జీవనభృతులను దెబ్బతీసే అంశాలను కూడా దాడులుగానే భావించాలని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టికి చెందిన ఎంపిటిసి, జెడ్‌పిటిసిలను కూడా ఈ సమావేశానికి ఆహ్వానించాలన్నారు. వారి వద్దకు ఎక్కువ సమస్యలు వస్తాయని, వాటిని పరిష్కరించడానికి ఈ వేదిక వీలుగా ఉంటుందని అభిప్రాయ పడ్డారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ శ్రీనివాస మూర్తి, ఎఎస్‌పి సౌమ్య లత, సోషల్ వెల్ఫేర్ డిడి రామానందం, డిఎస్‌పిలు, ఆర్‌డిఒలు, జిల్లా అధికారులు, ఆఫీషియల్ సభ్యులైన ట్రాన్స్‌కో ఎస్ఇ లక్ష్మణరావు, ఎపిజిఎల్ఐ ఎడి హైమావతి పాల్గొన్నారు.

పోలీసు కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా పోలీసుశాఖలో పని చేసి, ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించిన ఎఆర్ కానిస్టేబుల్ సిహెచ్ గోపాలరావు కుటుంబానికి సహోద్యోగులు ఆర్థికంగా చేయూతనిచ్చారు. 2000 సంవత్సరానికి చెందిన ఎపిఎస్‌పి, ప్రస్తుతం ఎఆర్ కన్వర్షన్‌గా విధులు నిర్వహిస్తున్న మిలీనియం బ్యాచ్ పోలీసు కానిస్టేబుళ్లు రూ.3.60 లక్షలను పోగు చేశారు. ఆ మొత్తాన్ని గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి వకుల్ జిందాల్ చేతుల మీదుగా ఆ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఈ తరహా చర్యలు చేపట్టడం వల్ల పోలీసు ఉద్యోగుల్లో ఐకమత్యం పెరగడంతోపాటు వారి కుటుంబాలకు అండగా ఉన్నామన్న భరోసా లభిస్తుందన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం సకాలంలో కల్పించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు, ఆర్ఐలు ఎన్.గోపాలనాయుడు, ఆర్.రమేష్ కుమార్, టి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో ఇ-వేస్ట్ సేకరణ కేంద్రాలు

విజయనగరం : మున్సిపాలిటీలతోపాటు అన్ని మండలాల్లో కూడా ఇ-వేస్ట్ సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 19వ తేదీ మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నాటికి వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలతో కలెక్టర్ తమ ఛాంబర్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శనివారం నిర్వహించాల్సిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై సమీక్షించారు. ఈ వారం ఇ-చెక్ అన్న అంశాన్ని ప్రభుత్వం నిర్దేశించిందని, దానికి అనుగుణంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు. ఇందులో 13 శాఖలు భాగస్వాములు కావాలని, ఆయా శాఖల పరంగా చేయాల్సిన విధులను, అంశాలను వివరించారు. గ్రామ, వార్డు స్థాయిల్లో జరిగిన కార్యక్రమాలను సైతం యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. చేసిన కార్యక్రమాలను ఆధారంగానే జిల్లాకు ర్యాంకింగ్ వస్తుందని చెప్పారు.

ఈ వారం ఇ-చెక్ అంశంతోపాటుగా చారిత్రక ప్రదేశాలు, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు, ఆస్పత్రులు, మార్కెట్లు, పట్టణ కేంద్రాలను పరిశుభ్రం చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఎన్‌జిఒలు, యువత, సామాన్యులను సైతం పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని సూచించారు. పట్టణాల్లో, మండలాల్లో ఇ-వేస్ట్ సేకరణ కేంద్రాలను మహిళా స్వయం సహాయక సంఘాలే నిర్వహిస్తాయని, దీనికోసం సంఘ సభ్యులకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఎలక్ట్రానిక్ చెత్త సేకరణలో భాగంగా ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్, రీ సైకిల్, రీ యూజ్)పై దృష్టి పెట్టాలని చెప్పారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన వాట్సాప్ గవర్నెన్స్‌పై దృష్టి పెట్టి, ప్రాచుర్యం కల్పించాలని కోరారు. పిజిఆర్ఎస్ వినతులను సంపూర్ణంగా, అర్జీదారుడు సంతృప్తి పడే విధంగా పరిష్కరించాలని చెప్పారు. అప్పుడే వారి నుంచి ప్రభుత్వానికి సరైన ఫీడ్‌బ్యాక్ వస్తుందని స్పష్టం చేశారు.

డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వకుంటే

చలో విజయవాడ

ఉపాధ్యాయ పోస్టుల సంఖ్యను పెంచాలి : డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రాము

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డిఎస్‌సి నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని, పోస్టుల సంఖ్య పెంచాలని, లేదంటే చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము నిరుద్యోగులకు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక గురజాడ గ్రంథాలయం ఆవరణంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాము మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం, నేటి టిడిపి ప్రభుత్వంలోనూ డివైఎఫ్ఐ పోరాట ఫలితంగానే డిఎస్‌సి పోస్టుల భర్తీకి ముందుకొచ్చారని అన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే నోటిఫికేషన్ ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వకుండా దోబూచులాడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో వేల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉంటే 16వేల పోస్టులే భర్తీ చేస్తామనడం అన్యాయమన్నారు. ఖాళీలకు అనుగుణంగా పోస్టుల సంఖ్యను పెంచాలన్నారు. ఇప్పటికే ఏళ్ల తరబడి డిఎస్‌సి కోసం కోచింగ్‌లు తీసుకొని, పట్టణాల్లో అద్దె రూముల్లో ఉంటూ వేలాది రూపాయలు ఖర్చు చేస్తూ నిరుద్యోగులు అప్పుల పాలవుతున్నారని అన్నారు. ప్రభుత్వం స్పందించి వారం రోజుల్లో డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని, దాటవేత ధోరణి మానుకోవాలని కోరారు. లేదంటే వారం రోజుల్లో చలో విజయవాడ నిర్వహించి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

యుటిఎఫ్ విద్యా విభాగం నాయకులు డి.రాము మాట్లాడుతూ ప్రశ్నిస్తే తప్ప మన హక్కులు, ఉద్యోగాలు వచ్చే పరిస్థితి నేడు లేదన్నారు. ప్రభుత్వాలు విద్యా రంగాన్ని ప్రైవేటీకరణ చేస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే పనిలో ఉన్నాయన్నారు. డిఎస్‌సి కోసం పదేళ్ల నుంచి పోరాడితే తప్ప డిఎస్‌సి ఇస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ముందుకు రాని పరిస్తితి నెలకొందన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగం రావాలంటే ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవడమే మనముందు కర్తవ్యమని అన్నారు. డిఎస్‌సి నోటిఫికేషన్‌కోసం చేసే పోరాటంలో యుటిఎఫ్ మద్దతు ఉంటుందని తెలిపారు. సదస్సులో జిల్లా కన్వీనర్ బి.హరీష్, డిఎస్‌సి అభ్యర్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రాము

మార్గనిర్దేశకుడు అంబేద్కర్

విజయనగరంటౌన్ : బిఆర్ అంబేద్కర్ తన రాజ్యాంగం రచనతో దేశానికే మార్గనిర్దేశకుడుగా వెలుగొందారని మాజీ కేంద్రమంత్రి, ప్రొఫెసర్ సంజయ్ పాశ్వాన్ అన్నారు. సిటియులో సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యాన గురువారం 'జాతి నిర్మాణం-మహిళా సాధికారతలో బిఆర్ అంబేద్కర్ పాత్ర' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. సంజయ్ పాశ్వాన్ మాట్లాడుతూ అణచివేత, సాధికారత సమస్యలను పరిష్కరించడంలో అంబేద్కర్ దార్శనికత దేశానికి ఎలా మార్గనిర్దేశం చేస్తుందో నొక్కి చెప్పారు. మాజీ ఎమ్‌పి, ప్రొఫెసర్ ఐజి సనాది మాట్లాడుతూ మహిళా హక్కులపై అంబేద్కర్ ఆలోచనలను, ముఖ్యంగా వివాహం, వారసత్వం, ఆస్తి విషయాలలో మహిళలకు చట్టపరమైన సమానత్వాన్ని స్థాపించడానికి ప్రయత్నించిన హిందూ కోడ్ బిల్లుకు ఆయన చేసిన కృషిని వివరించారు. అనంతరం ప్రొఫెసర్ ప్రమాణ్షి జయదేవ్ మాట్లాడారు. వివరించారు. కార్యక్రమంలో విసి టివి కట్టమణి, ప్రొఫెసర్ జె.ఎం. మిశ్రా, ప్రొఫెసర్ ఎం.శరత్చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో 'ఉపాధి' నిర్వీర్యం

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- చీపురుపల్లి

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాఖల వారీగా సమీక్ష చేశారు. ఈ క్రమంలో ఉపాధి హామీ అధికారుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలు వారీగా వలసలను నివారిస్తూ ప్రతి ఒక్కరికీ పని కల్పించి ఉపాధిని అందజేయాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన జాతీయ ఉపాధి హామీ పథకం చట్టానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తుందన్నారు. సకాలంలో పనులు కల్పించలేక, బిల్లులు చెల్లించకపోవడంతో పాటు శ్రమకు తగ్గ వేతనం లభించకపోవడంతో వేతనదారులంతా వలస బాట పడుతున్నారని అన్నారు. కూలీలకు కనీస వేతనం కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఉపాధి పథకంలో కూడా గ్రామాల వారీగా రాజకీయాలు చేస్తూ మేట్లను తొలగించడం సబబు కాదన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాల వారీగా తాగునీటి సమస్యలు లేకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గొల్లల ములగాంలో నూతనంగా ఏర్పాటు చేయాల్సిన కొళాయి కనెక్షన్‌తో పాటు కెల్లపాలెంలో తాగునీటి సమస్యను కూడా అధికారులు పర్యవేక్షించి పరిశీలించాలన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించి పనిచేస్తున్న సిబ్బంది ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వడం లేదంటూ కొంతమంది సర్పంచులు సమావేశంలో ఫిర్యాదు చేయడంతో జెడ్‌పి ఛైర్మన్ స్పందిస్తూ ప్రజాప్రతినిధులు సంప్రదించే సమయంలో సంబంధిత వైద్య సిబ్బంది అధికారులు వారికి ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. కర్లాం గ్రామంలో త్వరలో జరగనున్న గ్రామ దేవత పండగకు సంబంధించి విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్ సంబంధిత శాఖల అధికారులు పండగ ఏర్పాట్లకు సహకరించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఎంపిపి ఇప్పిలి వెంకట నరసమ్మ, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, మండల ఉపాధ్యక్షులు కరిమజ్జి వెంకట మ్మ, డిఎల్‌డిఒ హేమ్‌సుందర్రావు, తహశీల్దార్ ఎన్ రాజారావు, ఎంపిడిఒ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి www.prajasakti.com

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-కొత్తవలస

మంచి పౌష్టికాహారంతోనే గర్భిణులు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ అన్నారు. గురువారం ముసిరాం వెల్నెస్ సెంటర్‌లో ఐసిడిఎస్ పిఒ ఆర్.ఉమాదేవి, అడిషనల్ పిఒ లక్ష్మీబాయి ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు చేశారు. 12 మంది గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జోని సింహాద్రి నాయుడు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు రమణమ్మ, సత్యవతి, ముసిరాం సర్పంచ్ చింతల పైడినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : పౌష్టికాహారంతో ఆరోగ్యంగా ఉండగలమని ఐసిడిఎస్ సిడిపిఒలు అరుణకుమారి, బి.నిర్మల అన్నారు. బొబ్బిలి మున్సిపాలిటీలోని పాత బొబ్బిలిలో గురువారం పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డ జన్మించిన రెండేళ్ల వరకు జాగ్రత్తగా ఉండి పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. అంగన్వాడీ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని కోరారు.

నవధాన్యాల విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని వినాయకపల్లిలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి డి.కృష్ణ ఆధ్వర్యంలో గురువారం రాయితీపై నవధాన్యాల విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పి ఎస్.రాము పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ట్రాఫిక్ పోలీసులు వేధింపులు ఆపాలని, ఆటో పార్కింగ్ స్థలాలు యథావిధిగా కొనసాగించాలని 21న కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు విజయదుర్గ ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు అప్పలరాజు, రెడ్డి నారాయణరావు తెలిపారు. ధర్నాను విజయవంతం చేయాలని గురువారం ఆటో స్టాండ్‌లో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు చెన్నా ధర్మారావు, బాలి సన్యాసిరావు, గేదెల నారాయణరావు, టి.శ్రీధర్, కె.రాము తదితరులు పాల్గొన్నారు.

నగరంలో అసిస్టెంట్ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 29వ డివిజన్ లో గురువారం వార్డు పర్యటనలో నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కె.అప్పలరాజు పాల్గొన్నారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. అయితే ఖాళీ స్థలాలలో నిరుపయోగంగా పడి ఉన్న చెత్తాచెదారాలను గమనించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. చెత్తాచెదారాలు నిలవ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది ప్రజారోగ్యం దెబ్బతినే అవకాశం ఉంటుందని తెలిపారు. చెత్తాచెదారాలను తక్షణమే తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు.

సచివాలయంలో రికార్డులు తనిఖీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని గోపాలపల్లి గ్రామ సచివాలయాన్ని గురువారం ఎమ్మెల్యే ఇందుకూరి రఘురాజు సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం హౌసింగ్ సంబంధించి విషయాలను ఇంజినీరింగ్ అసిస్టెంట్ అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ వివిధ సమస్యలపై వీఆర్‌ఒ, కార్యదర్శితో చర్చించారు. అనంతరం గ్రామంలో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి పనులు పూర్తి చెయ్యటానికి మండల పరిషత్ నిధులు మంజూరు చేయాలని ఎంపిపి సోమేశ్వరరావును కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాణి, ఎంపిటిసి సన్యాసప్పడు, కెశోర్‌రావు, బి.రమణ, వల్లిన సతీష్, ఐ.సన్యాసినాయుడు, గోగాద నాయుడు పాల్గొన్నారు.

భూమన క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

భూమా కరుణాకర్ రెడ్డి తిరుపతి గోశాల విషయంలో హిందువుల మనోభావాలు దెబ్బతినే విధంగా నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదని, గోశాలలో ఏమి జరుగుతుందో చూసి మాట్లాడితే మంచిదని, లేకపోతే దేశంలో రాష్ట్రంలో ఉన్న హిందువులందరికీ క్షమాపణ చెప్పాలని విజయనగరం టిడిపి పార్లమెంట్ అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. గురువారం టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019లో కులమతాలను ఉపయోగించుకొని అధికారంలోకి వచ్చారని విమర్శించారు. ఆ గమనించే ప్రజలు 11 సీట్లు ఇచ్చారని విమర్శించారు. పాస్టర్ ప్రవీణ్ మరణాన్ని కూడా వాడుకొని మతాల మధ్య మంట తీసుకొచ్చారని చూస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో జెడ్‌పిటిసి మాజీసభ్యులు రాజాప్రసాద్, ఎంఎంసి చైర్మన్ క్రోతు నర్సింగరావు పాల్గొన్నారు.



క్లాప్ వాహనాల ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ నల్లనయ్య

ఆస్తి పన్ను చెల్లింపుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆస్తి పన్నుదారులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ సౌకర్యాన్ని పొంది తక్షణమే పన్నులు చెల్లించి నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కమిషనర్ పల్లి నల్లనయ్య పిలుపునిచ్చారు. గురువారం ఆస్తి పన్నుదారులకు మరింత చైతన్యపరిచేందుకు వినూత్న రీతిలో క్లాప్ వాహనాలతో పాటు సిబ్బంది నగరంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు అధిక సంఖ్యలో పాల్గొన్న ర్యాలీని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మీడియాతో మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను పన్నులను ఏక మొత్తంలో చెల్లిస్తే 5 శాతం రాయితీ పొందవచ్చునని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సర బకాయిలను ఏక మొత్తంలో ఒకేసారి చెల్లించినట్లయితే 50శాతం శాతం వడ్డీ మాఫీ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈనెల 30వ తేదీలోగా చెల్లించిన వారికి మాత్రమే ఈ అవకాశం ఉంటుందన్నారు.

ఎస్‌సి వర్గీకరణతో దళితులకు మేలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎస్‌సి వర్గీకరణతో దళిత వర్గాలకు మేలు జరుగుతుందని టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న హర్షం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఎస్‌సి వర్గీకరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ఎప్పుడూ దళితుల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేస్తుందని దీనిలో భాగమే ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఎస్‌సి వర్గీకరణ చేపట్టిందన్నారు. ముఖ్యంగా వర్గీకరణతో ఉద్యోగం, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ సమానంగా అమలు జరుగుతాయని తెలిపారు. సమావేశంలో దళిత నాయకులు కె.కళావతి, పి.కృష్ణ వేణి, సిహెచ్ గోవింద తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి రాజప్పన్న

రహదారిని తవ్వేస్తున్నారు..

- సంకిలి ఇథనాల్ ప్లాంట్ నుంచి వ్యర్థాలను వదిలేందుకు అనుమతులు
- ఇంజినీరింగ్ అధికారులు లేకుండానే కల్వర్టు పనులు
- దేవుదల, పుర్లి గ్రామస్తుల అభ్యంతరం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని చిన్నయ్యపేట సెంటర్ నుంచి దేవుదల మీదుగా పుర్లి గ్రామాలకు వెళ్లే జిల్లా పరిషత్ రోడ్డును సంకిలి ఇఐడి ప్యారి షుగర్ అనుబంధ సంస్థ ఇథనాల్ వ్యర్థ పదార్థాలు వదిలేందుకు 14 మీటర్ల వెడల్పులో తవ్వి కల్వర్టు నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ పనులు ఆర్‌అండ్‌బి అధికారుల పర్యవేక్షణ లేకుండా కర్మాగార యాజమాన్యం నిర్మిస్తుంది. వాస్తవంగా తారు రోడ్డును తవ్వాలంటే ఆర్‌అండ్‌బి అధికారులు పొడవు, వెడల్పు, ఎత్తు ఆధారంగా చలానా తీయించి అనుమతులు ఇవ్వాలి. కానీ ఆ పరిస్థితి లేదు. నిబంధనలను తుంగలో తొక్కి కేవలం 15 వేల రూపాయలు చలానాతోనే ఇష్టానుసారంగా అనుమతించారు. అది ఒక ఎత్తు అయితే ఈ కల్వర్టు నిర్మాణానికి మార్కింగ్ చేసేందుకు ఆర్‌అండ్‌బి అధికారులు రాకపోవడంతో పాటు ఎలా నిర్మిస్తున్నారో అని కనీసం పర్యవేక్షణ కూడా లేకపోవడంతో కర్మాగార యాజమాన్యం ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతుంది. ఈ రోడ్డు గుండా అధిక బరువులతో చెరుకు, ధాన్యం, అపరాల పంటల లారీలు, బస్సులు, ఇతర వాహనాలు తిరుగుతాయి.



రహదారి మధ్య నిర్మిస్తున్న కల్వర్టు

అటువంటి రోడ్డు మధ్యలో కల్వర్టు నిర్మించడం, అదీ నాణ్యత లేకుండా చేస్తే భవిష్యత్తులో కల్వర్టు కూలిపోతే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ కల్వర్టు కూలితే కనీసం ఐదు గ్రామాల రైతులు, ఉద్యోగులు, ప్రజలు, విద్యార్థుల రవాణా, రాకపోకలకు ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది. వ్యర్థ పదార్థాల తరలింపునకు ఇక్కడ కల్వర్టు నిర్మాణం చేపట్టొద్దని ఈ ఐదు గ్రామాల ప్రజలు వ్యతిరేకించినప్పటికీ అవి ఏవి పట్టనట్లు సుగర్స్ యాజమాన్యం నిర్మాణాలు చేపడుతుంది. ఇప్పటికే ఆయా గ్రామాల సర్పంచులు ఫోన్లు ద్వారా యాజమాన్యం దృష్టికి తీసుకు వచ్చినప్పటికీ అవేవీ పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు చేపట్టడాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బి అధికారులు కళ్ళు తెరిచి ఇక్కడ కల్వర్టు నిర్మాణంపై పరివేక్షణ జరిపి, అనుమతులకు మించి తవ్వకాలు జరిపినా, నాణ్యత లేకుండా నిర్మాణం చేపట్టినా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ జెఇ ఆనందరావును వివరణ కోరగా కల్వర్టు నిర్మాణం తనకు తెలియదని, బొబ్బిలి పంచాయతీరాజ్ డిఇ అనుమతిచ్చారని చెప్పడం కొసమెరుపు.

ప్రభుత్వ బడులతో ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి- చీపురుపల్లి

ప్రభుత్వ బడులలో పిల్లలను చేర్పించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని మండలంలోని మెట్టపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది గ్రామాల వారీగా పర్యటిస్తూ ప్రభుత్వ బడిలో పిల్లల్ని చేర్పించాలని కోరారు. ప్రత్యేకించి ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలంటూ వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ పలువురు విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించడానికి వినూత్న ప్రయత్నం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని కరకాము, సంకుపాలెం, పత్తికాయవలస గ్రామాల్లో ఉపాధ్యాయ సిబ్బంది పర్యటించి గ్రామాల వారీగా విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి వేలకు వేలు బిల్లులు చెల్లించుకుంటూ అవస్థలు పడొద్దని ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించి వారికి మంచి భవిష్యత్తును అందజేయాలని ఉపాధ్యాయ సిబ్బంది కోరారు.

ఉపాధి కూలీల వద్దకు ఉపాధ్యాయులు

మెరకముడిదాం : మండలంలో చినబంటుపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న వేతన దారులు వద్దకు ప్రభుత్వ ఉపాధ్యాయులు వెళ్లి 'మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి, మీ పిల్లల భవిష్యతకు మాది బాధ్యత అని' వేతనదారులను కోరారు. గురువారం మండలంలోని చిన బంటుపల్లి ఎంపియుపి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆల్తి రాంబాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సిబ్బంది ఉపాధి పనులు చేస్తున్న స్థలానికి వెళ్లి బడి బాటకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలు గురించి వివరించారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని వేతన దారులను కోరారు. అనుభవజ్ఞులైన గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులతో బోధిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.నారాయణరావు, శ్రీదేవి, త్రివేణి పలువురు పాల్గొన్నారు.



మెరకముడిదాం : ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ఇంటింటి ప్రచారం

వేపాడ : బడిఈడు పిల్లలను, వారి తల్లిదండ్రులను ఈ నెల 21న పాఠశాలకు ఆహ్వానించి, పండగ వాతావరణంలో ప్రవేశాలు చేపట్టాలని ఎంఇఒలు ఎం.నాగభూషణరావు, పి.బాలభాస్కరరావు ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం వేపాడ, వల్లంపూడి పంచాయతీల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల పైబడిన చిన్నారుల ఇళ్లకు వెళ్లి, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు, అంగన్వాడీలతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యా ప్రమాణాలపై అవగాహన కల్పించారు. బల్లంకి, బానాది, కెఆర్‌పేట ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేరాలని సూచించారు.



అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్తులు

ఆ రోడ్డుతో మాకు ఉపయోగమే

అధికారులకు స్పష్టం చేసిన వావిలపాడు గ్రామస్తులు

ప్రజాశక్తి-వేపాడ


పంచాయతీ నిధులు రూ.6 లక్షలతో 180 మీటర్ల మేర నిర్మించిన రోడ్డుతో తమకు ఉపయోగమేనని, అందులో ఎవరి స్వార్థ ప్రయోజనమూ లేదని వావిలపాడు గ్రామస్తులు అధికారులకు స్పష్టంచేశారు. వావిలపాడు గ్రామంలో రైతుల కళ్లాలకు, పొలాలకు నిర్మించిన రహదారిని తహశీల్దార్ రామలక్ష్మి, పిఆర్ జెఇ ఆలి గురువారం పరిశీలించారు. తాతల కాలంలో వేసిన బాట ఇదని, వర్షాకాలంలో కళ్లాలకు, పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు రావడంతో పంచాయతీ పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లామని రైతులు చెప్పారు. దీంతో పాలకవర్గం రోడ్డు నిర్మించడంతో తమకు ఎంతో ప్రయోజనం చేకూరిందని అధికారులకు స్పష్టంచేశారు. ఇందులో ఎవరి స్వప్రయోజనమూ లేదని కుండబద్దలుకొట్టారు. ఇదే విషయమై రైతులు, గ్రామస్తులు రాత పూర్వకంగా అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బీల రాజేశ్వరి, బూడి చినబాబు, బూడి వెంకన్న, శ్రీను, నాయుడు, బి.సతీష్, చిన్న అమ్ములు, బెహరా రాము, ఎన్.పైడితల్లి, పెద్ద సత్యం, బి.సింహాచలం, బి.దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ప్రజాశక్తి-లక్కవరపుకోట

సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. గురువారం లక్కవరపుకోటలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజదర్బార్ నిర్వహించారు. ఐదు మండలాల ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ, హౌసింగ్, పింఛన్లు, రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణం కోసం వినతులు వచ్చాయన్నారు. సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదులు పంపించి సత్వరమే పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానన్నారు.





రిసోర్స్‌పర్సన్లను సత్కరిస్తున్న ఎంఇఒలు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రిసోర్స్‌పర్సన్లకు సన్మానం

ప్రజాశక్తి- గరివిడి

మండలంలోని కాపుశంభాం జెడ్‌పి హైస్కూలు లో సుదీర్ఘకాలం కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్స్‌గా పనిచేసిన ఎవి శ్రీనివాస్, కె.నాగేశ్వరరావు, సతీష్‌లను ఎంఇఒలు ఎ. రామారావు, అప్పన్న, స్కూల్ కాంప్లెక్స్ చైర్ పర్సన్ డి రాము, సెక్రెటరీ కె నిర్మల ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయులంతా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యారంగానికి వారు చేసిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. మండల విద్యాశాఖ అధికారి రామారావు మాట్లాడుతూ కాంప్లెక్స్‌లో రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరిస్తూ టీచర్లు అందర్నీ చైతన్యవంతులుగా చేసి, ప్రభుత్వ కార్యక్రమాలన్నీ చక్కగా ఉపాధ్యాయులకు అర్థమయ్యే విధంగా చెప్పారన్నారు. వీరు సేవలకు గుర్తింపుగానే కాంప్లెక్స్‌లో ఉన్న ఉపాధ్యాయులందరూ ఈ సన్మానం చేస్తున్నట్టు చెప్పారు. సూరి శ్రీను అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ పరిధిలో ఉన్న 16 పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - డెంకాడ

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైద్య శాఖలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు గురువారం మధ్యాహ్నం నిరసన వ్యక్తం చేశారు. 6 ఏళ్ళు సర్వీస్ పూర్తి చేసిన వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 23 శాతం రెమ్యూనరేషన్ పెంచాలని, ఇన్సెంటివ్ మొత్తాలను చెల్లించాలని కోరారు. పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్లకార్డ్సను పట్టుకొని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎచ్‌పి సంఘ ప్రతినిధులు అలేఖ్య, పావని, లోకేశ్వరి, సౌజన్య, అరుణ, ఇందిర పాల్గొన్నారు.

నెల్లిమర్ల : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సతివాడ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు శాంతియుత ధర్నా నిర్వహించారు. ఆరేళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారిని రెగ్యులైజ్ చేయాలని, సిహెచ్ఒలకు బదిలీసౌకర్యం కల్పించి గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి ప్రత్యేక రాయితీలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది జి.హిమబిందు, ఎ.అనూష, బి.సంతోషి, పి.తేజస్విని, ఎస్.ప్రసూన, బి.షీబారాణి, కె.సంగీత, కె.బాలకుమారి, కె.సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

వంగర : ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న మిడ్ - లెవల్ హెల్త్ ప్రొవైడర్లు ను రెగ్యులర్ చేసి ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్లకార్డులు పట్టుకొని ఆరోగ్య సిబ్బంది నిరసన చేపట్టారు. డిమాండ్లు పరిష్కరించకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు.



సత్యనారాయణను అభినందిస్తున్న హెచ్‌ఎం శంకర్రావు

చిత్రలేఖనంలో అవార్డులు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

జాతీయ చిత్రలేఖనం పోటీల్లో స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు పలు అవార్డులు లభించాయి. గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శంకరరావు విద్యార్థులతో పాటు డ్రాయింగ్ ఉపాధ్యాయులు ఇనపకుర్తి చిన సత్యనారాయణను అభినందించారు. ఈ నెల 5వ తేదీన విజయవాడలోనే డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ అకాడమీ నిర్వహించిన 12వ జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలకు విద్యార్థులు 40 చిత్రాలు పంపగా వాటిలో 6 బంగారు పథకాలు, 8 కాంస్య పథకాలు సాధించాయి. 24 మంది విద్యార్థులకు మెరిట్ అవార్డు సర్టిఫికెట్ల అందజేశారు. చిత్రలేఖనంలో విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్న ఉపాధ్యాయుడు చిన్న సత్యనారాయణను హెచ్‌ఎం శంకర్రావు ఉపాధ్యాయులు అభినందించారు.

కోలుకున్న యువతి

ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్

వైద్య ఖర్చులకు రూ.1,85,837 చెల్లించిన ప్రభుత్వం

ప్రజాశక్తి-విజయనగరంకోట

గరివిడి మండలం శివరాం గ్రామంలో ఈనెల 5న తన ఇంటి వద్ద కత్తిపోట్ల కు గురై నగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన కొండ్రు అఖిల(18) కోలుకోవడంతో ఆమెను ఆసుపత్రి వర్గాలు గురువారం డిశ్చార్జ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. పక్క టెముకలకు గాయమై చికిత్స పొందిన అనంతరం కోలుకోవడంతో ఆమెను వైద్యులు డిశ్చార్జ్ చేసినట్లు పేర్కొన్నారు. పన్నెండు రోజుల పాటు ఆసుపత్రిలో ఆమె వైద్యానికి అయిన ఖర్చుల కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.1,85,837 చెక్కు రూపంలో ఆమెకు వైద్యం అందించిన తిరుమల మెడికవర్ యాజమాన్యానికి చెల్లించిందని తెలిపారు. ఆ యువతి వైద్య చికిత్స నిమిత్తం అవసరమైన మందులు కూడా ఉచితంగా అందజేసినట్లు తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-బొబ్బిలి

అగ్నిప్రమాదాల నివారణపై గురువారం శ్వేతా చలపతి పాఠశాలలో విద్యార్థులకు అగ్నిమాపక అధికారి సాంబమూర్తి అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు, విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు ప్రాక్టికల్‌గా వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

శృంగవరపుకోట : డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్లో అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. ప్రమాదాలను అరికట్టే చర్యలను గురించి వివరణాత్మకంగా అగ్నిమాపక కేంద్రం సర్కిల్ ఇన్స్పెక్టర్ షేక్ మదీనా తెలియజేశారు. ఎస్ఐ శ్రీనివాస్, పాఠశాల యాజమాన్య ప్రతినిధి సోలపర్తి రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపల్ వై.జానకిదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ప్రజాశక్తి-రామభద్రపురం

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని డిప్యూటీ డిఇఒ మోహనరావు తెలిపారు. ఈ విషయంపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకు కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల పనితీరు, అర్హతలు వివరించాలన్నారు. ప్రభుత్వం ఎల్ఇపి అనే కొత్త యాప్ ప్రారంభించిందని, విద్యార్థుల, ఉపాధ్యాయుల వివరాలతోపాటు అనేక పాలనాంశాలు ఇందులో పొందుపరిచారని తెలిపారు. ప్రజా భాగస్వామ్యం, దాతలు సహకారంతో పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వేసవిలో నిర్వహించే ప్రత్యేక విద్యా కార్యక్రమాలకు అందరూ అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు తిరుమల ప్రసాద్, పెంటయ్య, హెచ్‌ఎం కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన గురువారం ఐసిడిఎస్ పిఒ ఉమకు వినతి అందించారు. యూనియన్ ప్రాజెక్టు నాయకులు డి.శ్యామల మాట్లాడుతూ మినీ సెంటర్లను మెయిన్ కేంద్రాలుగా మార్చి, వారితో సమానంగా వేతనాలు ఇవ్వాలన్నారు. మూడు నుంచి ఐదేళ్లలోపు పిల్లలను అంగన్వాడీ సెంటర్‌లోనే కొనసాగేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. మెనూ ఛార్జీలు పెంచాలన్నారు.

వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య

ప్రజాశక్తి- భోగాపురం

భర్త పెడుతున్న చిత్రహింసలను భరించలేక విసుగు చెంది ఇప్పిలి అంకయ్యమ్మ (45) అనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదకరమైన సంఘటన మండలంలోని రావాడ పంచాయతీ గొల్లపేట గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రాజాపులోవకు చెందిన ఇప్పిలి రమణ సొంత మేనత్త కూతురైన అంకయ్యమ్మను 22 ఏళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. రమణ ఎనిమిదేళ్ల కిందట నుంచి గొల్లపేటలో నివాసం ఉంటున్నాడు. భర్త రమణ తరచూ వేధింపులకు గురిచేస్తుండడంతో గ్రామ పెద్దలతో పాటు పోలీస్ స్టేషన్‌లో కూడా గతంలో పంచాయతీలు జరిగాయి. కానీ ఆయనలో ఎటువంటి మార్పు రాలేదు. ఉన్న కొద్దిపాటి భూమిని అమ్మేస్తాననడంతో కూతురు ఉందని, దాని పెళ్లి కోసం దాచుకున్న భూమిని అమ్మేందుకు వీలు లేదని ఆమె పట్టు పట్టింది. ఆ భూమి పత్రాల కోసం వేధింపులకు గురి చేయడంతో ఆమె గురువారం ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇది చూసిన భర్తతో పాటు కుటుంబ సభ్యులు తలుపులు తెరిచి ఆమెను కిందకు దించేసరికే మృతి చెందింది. భయంతో వీరంతా స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు. ఈ సమాచారం అందుకున్న ఎస్ఐలు పాపారావు, సూర్యకుమారి సంఘటన స్థలాన్ని పరిశీలించి జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీమ్‌ను తెప్పించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

3 ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి-బొండపల్లి

మండలంలోని వెదురువాడ రెవిన్యూ పరిదిలో గల కొండపేట సమీపంలో గల డి పట్టా స్థలంలో యధేచ్ఛగా కంకర అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో ఆర్ఐ హరికృష్ణ, విఆర్ఒ త్రినాధ్ దాడి చేసి తవ్వకాలు చేస్తున్న జెసిబితో పాటు మూడు ట్రాక్టర్లను సీజ్‌చేశారు. వాటిని స్థానిక పోలీసులకు అప్పగించారు.